APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్
నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక

07-06-2026
ఆదివారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 223
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్
FOLLOW:
https://epaper.expresstelugudaily.com



ఫ్రెంచ్ ఓపెన్ విజేత మిరా ఆండ్రీవా

2



ఫామ్‌హౌస్ కేడీతోనైనా.. ఢిల్లీ మోడీతోనైనా..

# కొట్లాడుతా

## నేను పదవి నుంచి దిగిపోవాలని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారు

## తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోడీ గద్దె దిగాలి

- ఈనెల 15వ తేదీ తర్వాత ఒడ్లు కొనకుంటే.. బండి సంజయ్, కిషన్ రెడ్డిల సంగతేంటో చూస్తా
- మర్యాద తప్పితే ఎవ్వరినీ పొలిమేర కూడా దాటనివ్వం
- ఎన్ని రిపేర్లు చేసినా చెడిపోయిన కారు ఇక పనికిరాదు
- కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం
- ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు
- అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం
- కోహెడ సమీకృత పండ్ల మార్కెట్‌తో అంతర్జాతీయ గుర్తింపు: సీఎం రేవంత్ రెడ్డి

2

హైదరాబాద్ నగర సిగలో మరో మణిహారం రానుంది. ప్రతిష్ఠాత్మక రామోజీ ఫిలిం సిటీ సమీపంలో ఓఆర్ఆర్ పక్కన కోహెడలో అంత ర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ అనేది కొలువు దీరబోతుంది. ప్రపంచ స్థాయి నాణ్యత ప్రమాణాలతో కూడిన సాంకేతిక హంగులతో అంతర్జాతీయ మార్కెట్ నిర్మాణం చేపట్టబోతున్నారు. రంగారె డ్డి జిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు శనివారం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ప్రసంగించారు.



2

## గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా తెలంగాణ

- సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ అత్యంత అనుకూలం
- ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించాలి
- ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని కోరిన మంత్రి శ్రీధర్ బాబు

## ఇసుక దందా సాగితే సహించేది లేదు

- అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలి
- మంత్రి వివేక్ వెంకటస్వామి



2



## లక్ష కోట్ల భూదోపిడీకి స్కెచ్

- పేదలకు అన్యాయం చేస్తూ పెద్దలకు భూములను కట్టబెట్టే కుట్రను బట్టబయిలు చేస్తాం
- భూదోపిడీకి బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే.. రేవంత్ రెడ్డి తలుపు తెరిచాడు
- కాంగ్రెస్ కు ఇదే ఆఖరి సర్కార్.. 20 ఏళ్లు ఆ పార్టీని బొందపెట్టే పనులను రేవంత్ రెడ్డి చేస్తున్నాడు
- ప్రాణం పోయినా సరే తెలంగాణలో ఇంచు భూమిని దోపిడీ చేయనివ్వం
- 10 ఎకరాల శిఖం భూమి కొన్న పవన్ కళ్యాణ్ వెంటనే తిరిగి ఇచ్చేయాలి
- ఆంధ్రా విష కోరల్లోంచి తెలంగాణను సాధించుకున్నాం.. కచ్చితంగా తెలంగాణ మా జాగీరే
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

2

మరోసారి పెరిగిన గృహ వినియోగ

## గ్యాస్ సిలిండర్ ధర

### రూ.29 మేర పెంచుతూ నిర్ణయం

ఢిల్లీ : దేశవ్యాప్తంగా మరోసారి గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర పెరిగింది. సిలిండర్ ధరను రూ.29 మేర పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మూడు నెలల వ్యవధిలో డొమెస్టిక్ సిలిండర్ ధర పెరగడం ఇది రెండోసారి. ఢిల్లీలో 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.913 నుంచి రూ.942కు చేరింది. పెంచిన ధరలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మార్చి 7న గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.60 పెంచిన విషయం తెలిసిందే.



విలేకరులు కావలెను
స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com
Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# లక్ష కోట్ల భూదోపిడీకి స్కెచ్

హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్: రేవంత్ రెడ్డి సర్కార్ లక్ష కోట్ల భూదోపిడీకి తెరతీసిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. పేదలకు అన్యాయం చేసి పెద్దలకు ఈ భూములను కట్టబెట్టేందుకు చేస్తున్న కుట్రను బట్టబయలు చేస్తామన్నారు. రేవంత్ సర్కార్ భూదోపిడీని సాక్ష్యాధారాలతో వరుసగా ప్రజల ముందు ఉంచబోతున్నామన్నారు. బంజారాహిల్స్ లో తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సోదరులు, మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు అంతా తెలంగాణ వనరులను బందిపోటు దొంగల్లాగా దోచుకుంటున్నారన్నారు. తెలంగాణ వనరులను, అస్తిత్వాన్ని కాపాడే పోర్టంలో ప్రాణాలు పణంగా పెట్టి అయిన సరే ఈ భూదోపిడిని అడ్డుకుంటామన్నారు. అటు పవన్ కళ్యాణ్ కొనుకుంటే చెరువులోకి కబ్జా పది ఎకరాలు శిఖం భూమేనని తేల్చిచెప్పారు. ఈ భూమిని వెంటనే తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి సాధించుకున్న తెలంగాణ...కచ్చితంగా మా జాగీరే అని స్పష్టం చేశారు.

**లక్ష కోట్ల భూదోపిడీకి స్కెచ్..**

పేద ప్రజలకు తీరని అన్యాయం చేస్తూ, లక్ష కోట్ల విలువైన భూములను బడా బాబులకు అప్పనంగా అప్పగించే భారీ కుట్రకు రేవంత్ సర్కార్ తెరలేపిందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ దందాలో సీఎం సోదరులు, మంత్రులు, అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. బందిపోటు దొంగల్లాగా భూములను దోచుకుంటున్న వారి బండారం బయటపెడతామన్నారు. ముఖ్యంగా మూసీ నది గర్భంలోనే నిబంధనలకు విరుద్ధంగా భారీ భవనాన్ని నిర్మిస్తున్న 'శ్రీ ఆదిత్య బిల్డర్స్' పై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో ఇదే ఆదిత్య బిల్డింగ్ వద్ద మేము ధర్నా చేస్తే హైడ్రా తమపైనే దాడికి దిగిందని గుర్తు చేశారు. కానీ ఆధారాలు చూపించడంతో సైలెంట్ అయిపోయారని చెప్పారు. ఆదిత్య బిల్డర్స్ వాళ్లు ఏకంగా ఏడు ఎకరాల మూసీలో కబ్జా పెట్టారని అన్నారు. దీని వెనుక ఒక ఎంపీ ఉన్నారని కవిత ఆరోపించారు. అదే విధంగా ప్రేమవతి పేట వద్ద పెద్ద చెరువుకు సంబంధించి 2021లో అనుమతులు పొంది, నాటి నుంచి నేటి వరకు ఏకంగా ఏడు ఎకరాల చెరువు భూమిని కబ్జా చేశారని మండిపడ్డారు. రూ.700 కోట్ల విలువైన ఈ భూమిపై ఏకంగా 30 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తూ వేల కోట్ల వ్యాపారం చేస్తున్నారన్నారు. అక్కడ ఉన్న గ్రామానికి సంబంధించిన పాత నక్షను సైతం మార్చేసి తప్పులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. బడా సంస్థ అయిన 'మెగా'కు చెందిన ఐకాం అనే ఆయుధాల తయారీ సంస్థ సైతం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 59లో ఉన్న మేడి బావి, జాలు బావి చెరువుల వద్ద ఐదు ఎకరాల భూమిని కబ్జా చేసిందని చెప్పారు. దీనిపై అక్కడి మున్సిపాలిటీలోనే తీర్మానం చేసినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పేదల ఇళ్లను కూల్చేస్తున్న హైడ్రాకు బడా బాబుల సంస్థలపై చర్యలు తీసుకునే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఆదిత్య బిల్డర్స్ కు సంబంధించి పూర్తి ఆధారాలను బయట పెడుతామని హెచ్చరించారు. మూసీ గర్భశోకం ఎవరికీ మంచిది కాదని, ఈ అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అప్పులు పుట్టడం లేదనే సాకుతో ఉన్న భూములను ఇలాగే అమ్ముకుంటూ పోతే, రాబోయే తెలంగాణ నెక్స్ జనరేషన్ భవిష్యత్ అవసరాల కోసం భూములు ఎక్కడ ఉంటాయని కవిత ప్రశ్నించారు. తెలంగాణ భూములను ప్రభుత్వ పెద్దల కోరల నుంచి రక్షించేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లైనా చట్టపరమైన లీగల్ ఫైట్ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ భవిష్యత్తు కోసం, పేద ప్రజల హక్కుల కోసం ప్రాణాలు పణంగా పెడతామన్నారు.

**కాంగ్రెస్ కు అధికారం ఇదే ఆఖరి బార్..**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇదే ఆఖరి బార్ అని, మరో 20 ఏళ్ల పాటు ఆ పార్టీని ప్రజలు బొందపెట్టే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు ఉందని కవిత అన్నారు. తెలంగాణ వనరులను, సంపదను, భూములను ఈ ప్రభుత్వ పెద్దలు బందిపోట్ల మాదిరిగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో అక్రమాలకు, అవినీతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కిటికీలు తెరిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులు తెరిచి దోపిడీకి తెరలేపిందని ఆరోపించారు. నాడు, నేడు రాష్ట్రంలో నడుస్తోంది 'కేటీఆర్' పాలనేనని ఎద్దేవా చేశారు. గతంలో కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, కల్వకుంట్ల రామారావు కాగా.. ఇప్పుడు కేటీఆర్ పాలన అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని విమర్శించారు. గతంలో ఫినిక్స్ సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం 50 ఎకరాల భూమిని ధారాదత్తం చేస్తే, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ఇదే రేవంత్ రెడ్డి దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ మాట్లాడారని గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే ఫినిక్స్ సంస్థకు మరో వంద ఎకరాలను కలిపి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తుండటం ఆయన ద్వంద్వ విధానాలకు నిదర్శనమన్నారు.

**పవన్ కళ్యాణ్... శిఖం భూమి తిరిగి ఇచ్చేయ్..**

తెలంగాణ వచ్చిన తర్వాత 11 రోజులు అన్నం తినకుండా బాధపడ్డానని చెప్పుకున్న పవన్ కళ్యాణ్, ఆ బాధలోనే ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా 'శిఖం' భూములు కొనుగోలు చేశారని కవిత అన్నారు. సర్వే నంబర్ 706 పరిధిలోని 'కోడికుంట' చెరువుకు సంబంధించిన 10 ఎకరాల శిఖం భూమినే ఆయన కొన్నారని, ఇది పక్కా శిఖం భూమి అని ఇరిగేషన్ శాఖ సైతం నోటిపై చేసిందని స్పష్టం చేశారు. అయితే ఈ భూమి రిజిస్ట్రేషన్‌లో భారీగా అక్రమాలు జరిగాయని, కేవలం మూడు ఎకరాలు మాత్రమే శిఖం అని చూపిస్తూ..



మిగతా భూమిని మాగాణిగా మార్చి తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. శిఖం భూమి అని తేలితే ప్రభుత్వానికి వాపస్ ఇస్తానని గతంలో పవన్ కళ్యాణ్ స్వయంగా చెప్పారని, కాబట్టి ఇచ్చిన మాట ప్రకారం ఆయన వెంటనే ఆ 10 ఎకరాల భూమిని ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. సాధారణ రైతులకు చట్టప్రకారం ఎలాంటి నష్టపరిహారం ఇస్తారో, అలాగే పవన్ కళ్యాణ్‌కు కూడా నష్టపరిహారం చెల్లించి ఆ చెరువు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. చెరువులను, తెలంగాణ వనరులను కాపాడటంలో ఎవరికీ మినహాయింపులు ఉండకూడదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**మీ విషకోరల్లోంచి సాధించుకున్న తెలంగాణ మా జాగీరే..**

తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని కాపాడుకోవడానికి ప్రశ్నిస్తే దాన్ని 'ప్రాంతీయ వాద ఉగ్రవాదం' అంటూ పవన్ కళ్యాణ్ మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఆంధ్రా విషకోరల నుంచి ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ కచ్చితంగా మా జాగీరేనని, ఇక్కడి మేధావులను, జానపద కళాకారులను అవమానిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సినిమా ఇండస్ట్రీకి అత్యధిక ఆదాయం వచ్చేది నైజాం ప్రాంతం నుంచేనని, ఇక్కడ కొనుక్కుంటున్న లగ్జరీ కార్లు, వేల కోట్ల భూములు అన్నీ తెలంగాణ ప్రజలు కొన్న సినిమా టికెట్ల సొమ్మేనని గుర్తుచేశారు. ప్రజల సొమ్ముతో బతుకుతూ, ప్రజా కళాకారుడు గద్దరన్నకు ఎప్పుడో ఒక కారు కొనిచ్చానని ఇప్పుడు ప్రచారం చేసుకోవడం గద్దరన్నను, తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనన్నారు. కుడిచేత్తో చేసే దానం ఎడమచేతికి తెలియకూడదనే కనీస నైతికత లేకుండా మాట్లాడటం సిగ్గుచేటని కవిత విమర్శించారు. తెలంగాణ జానపద కళాకారుల ట్యూన్స్ వాడుకుని కోట్లు సంపాదించిన మీరు, ఏనాడైనా చిన్న కళాకారులకు రాయల్టీ ఇచ్చి ఆదుకున్నారా అని నిలదీశారు. రాజ్యాంగబద్ధంగా ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయవచ్చుని, కానీ దోపిడీకి గురైన తెలంగాణ గడ్డపై మళ్లీ ఆంధ్రా సమైక్యవాదుల రాజకీయం ఏంటని వారు ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు వద్దంటున్నా 'వన్ సైడ్ లవ్' అంటూ బలవంతంగా ఇక్కడ రాజకీయం చేయాలనుకోవడం, తిరస్కరిస్తే యాసిడ్ పోస్తామనడం లాంటి వికృత ధోరణిని సహించేది లేదన్నారు. పవన్ కళ్యాణ్ ముందు ఆంధ్రా ప్రజలకు మేలు చేయాలని, మా పాలన మేము చేసుకోగలమని హితవు పలికారు. ఇక్కడ సరైన నాయకుడు లేక పవన్ కళ్యాణ్‌ను అడ్డం పెట్టుకుని రెండు ఓట్లు రాబట్టుకోవాలని బీజేపీ చూస్తోందని ఎద్దేవా చేశారు. పంజాబ్‌లో పండిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, తెలంగాణలో మాత్రం ఎందుకు ఆంక్షలు విధిస్తోందో ఇక్కడి బీజేపీ ఎంపీలు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ రైతుల పట్ల వివక్ష చూపిస్తున్న కేంద్ర వైఖరిని ప్రశ్నించని బీజేపీకి వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదని, ఆ పార్టీకి ఉన్న ఎనిమిది మంది ఎంపీలు మళ్లీ గెలవడం కల్ల అని స్పష్టం చేశారు.

**నీళ్ల మీద సీఎంకు అవగాహన లేదు..**

పాలమూరు జిల్లా బిడ్డ అయి ఉండి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత 30 నెలలుగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఒక్క రివ్యూ కూడా చేయకపోవడం సిగ్గుచేటని కవిత అన్నారు. తాము క్షేత్రస్థాయిలో వెంటపడి ధర్నాలు, ఆందోళనలు చేస్తేనే ప్రభుత్వం మొదటిసారి సమీక్ష నిర్వహించిందని గుర్తుచేశారు. ఈ ముఖ్యమంత్రికి నీటి ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదని, మొదట ఆయన ఆ సబ్జెక్టుపై నాలెడ్జ్ పెంచుకోవాలని హితవు పలికారు. తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి ఆంధ్రాకు 260 టీఎంసీల నీళ్లు తీసుకోమని చెప్పడం రాష్ట్రానికి ద్రోహం చేయడమేనన్నారు. గతంలో తుమ్మడిహెట్టిని అంగీకరించని మహారాష్ట్ర సీఎం వద్దకు వెళ్లి ఏదో చేస్తున్నట్లు భ్రమలు కల్పిస్తూ నాటకాలాడుతున్న రేవంత్ రెడ్డి, పక్క రాష్ట్రంలో ఉన్న తన రాజకీయ గురువు చంద్రబాబు నాయుడిని మాత్రం ఎందుకు కలవడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వెంటనే చంద్రబాబును కలిసి మనకు రావాల్సిన 200 టీఎంసీల నీటిని డిమాండ్ చేయాలని, ఒకవేళ బనకచర్లకు అంగీకరిస్తే తెలంగాణకు నీటి ద్రోహం చేసినట్లేనని హెచ్చరించారు. భవిష్యత్తులో మనకు కృష్ణా నీళ్లు సరిపోవు కాబట్టి గోదావరిలో 200 టీఎంసీల నీటిని తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**ఉద్యమకారులకు భూమి ఇవ్వాల్సిందే..**

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే అఖిలపక్ష సమావేశానికి తమను పిలవకపోవడాన్ని ప్రభుత్వ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు కచ్చితంగా భూమి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. దీనికోసం వచ్చే నెలలో ఉప్పల్ భగాయత్ పరిధిలో పెద్ద ఎత్తున భూపోరాటం చేయబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే నాదర్‌గుల్‌లో ఉన్న 200 ఎకరాల భూమిని కూడా వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## యాంత్రీకరణ ద్వారానే భవిష్యత్ అభివృద్ధి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** దేశంలో తెలంగాణను వరి ఉత్పత్తి రాష్ట్రంగా నిలిపిన తర్వాత, బియ్యం ఎగుమతులు, ఆధునిక సాంకేతికతలు, విలువ ఆధారిత ఉత్పత్తుల రంగంలో కూడా ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో రైస్ మిల్లర్లు కీలక భాగస్వాములని రైతులు, మిల్లర్లు, వినియోగదారులు అందరూ కలిసి అభివృద్ధి ఫలాలను పొందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శనివారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో2026లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బియ్యం ఎగుమతులను పెంచేందుకు తెలంగాణలో కొత్తగా ఏర్పాటు అయ్యే ఎగుమతి ఆధారిత రైస్ మిల్లులకు, ప్రస్తుతం పనిచేస్తున్న మిల్లులు ఎగుమతుల వైపు మళ్లేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. యాంత్రీకరణ ద్వారానే భవిష్యత్ అభివృద్ధి ఉందని, రైస్ మిల్లింగ్ రంగంలో కార్మికుల కొరత ప్రధాన సవాలుగా మారిందని యాంత్రీకరణ, ఆటోమేషన్‌కు మిల్లర్లు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా ఉత్పాదకత పెరగడంతో పాటు కార్మికుల కొరత సమస్యను అధిగమించవచ్చన్నారు. స్టీల్ సైలోలు, ఆటోమేటెడ్ గోదాములు, కృత్రిమ మేధస్సు ఆధారిత ధాన్య పర్యవేక్షణ వ్యవస్థలు, డిజిటల్ ఇన్వెంటరీ నిర్వహణ వంటి ఆధునిక నిల్వ సదుపాయాల నిర్మాణం అత్యవసరమన్నారు. ప్రజాప్రైవేటు భాగస్వామ్య విధానంలో భారీ సామర్థ్యంతో గోదాముల నిర్మాణానికి పెట్టుబడిదారులు ముందుకు రావాలని ఆహ్వానించారు. పార్బాయిలింగ్ యూనిట్లలో నీటి వినియోగాన్ని తగ్గించే, విద్యుత్ ఆదా చేసే ఆధునిక సాంకేతికతలను పరిశ్రమలు అవలంబించాలని సూచించారు. భవిష్యత్ ప్రాసెసింగ్ యూనిట్లు నీటి పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నాణ్యతతో పాటు పోషక విలువలను కూడా దృష్టిలో ఉంచుకుని బియ్యం ప్రాసెసింగ్ జరగాలన్నారు. నియంత్రిత వైటనింగ్, ప్రిసిషన్ పాలిషింగ్, పోషకాలను కాపాడే సాంకేతికతలు, ఏఐ ఆధారిత నాణ్యత నిర్ధారణ విధానాలు వినియోగదారులకు మరింత ఆరోగ్యకరమైన బియ్యం అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.

**వరి కొనుగోళ్లలో తెలంగాణ వాటా 60 శాతం ఉంది..**

ప్రస్తుతం తెలంగాణలో ఏటా సుమారు 300 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరుగుతోందని, దేశంలో యాసంగి వరి కొనుగోళ్లలో తెలంగాణ వాటా దాదాపు 60 శాతం ఉందన్నారు. ప్రస్తుత ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతుల ఖాతాల్లో ప్రభుత్వం దాదాపు రూ.39 వేల కోట్లు జమ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు రూ.96 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ పథకం ద్వారా 3.2 కోట్ల మందికి లబ్ధి చేకూరుతోందని, ఇందుకోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు.రైతులు, మిల్లర్లు, సాంకేతిక నిపుణులు, విధాన రూపకర్తలు సమష్టిగా కృషి చేస్తే తెలంగాణ బియ్యం ఉత్పత్తిలోనే కాకుండా, బియ్యం సాంకేతికత, ఆవిష్కరణలు, ఎగుమతుల రంగంలో కూడా ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభాం వ్యక్తం చేశారు.

## గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా తెలంగాణ

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. తెలంగాణ అత్యంత అనుకూలమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని కోరారు. మలేషియా-పెనాంగ్ డిప్యూటీ సీఎం వైబీ జగదీప్ సింగ్ దియో నేతృత్వంలోని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధుల బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును శనివారం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణమలేషియా (పెనాంగ్) మధ్య సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏఐ, ఇన్నోవేషన్స్, హ్యూమన్ క్యాపిటల్ డెవలెప్‌మెంట్ తదితర రంగాల్లో పరస్పర సహకారానికి గల అవకాశాలపై ఈ భేటీలో చర్చించారు.చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు వారికి వివరించారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, ఏరో స్పేస్, డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. "తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం. ఇరు ప్రాంతాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేలా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకెళ్తాం" అని వైబీ జగదీప్ సింగ్ దియో పేర్కొన్నారు.

## జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు

**నేషనల్ బ్యూరో :** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు ప్రారంభించింది. నీట్ పేపర్ లీక్, సీబీఎస్‌ఈ ఓఎస్ఎం వ్యవస్థలో అవకతవకల నేపథ్యంలో ఈ ఆందోళనలను చేపడుతోంది. సీజేపీ వ్యవస్థాకుడు అభిజీత్ దీప్కే ఇచ్చిన పిలుపుమేరకు వేలాదిమంది యువత నిరసన వేదిక వద్దకు తరలివచ్చారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి', 'మేము మేక్ ఇన్ ఇండియా అడిగితే.. మీరు లీక్ ఇన్ ఇండియా ఇచ్చారు' అని నినాదాలు చేశారు. జూన్ 6న జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని కొన్ని రోజుల క్రితం అభిజీత్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో పాల్గొనేందుకు అమెరికాలోని బోస్టన్ నుంచి అతడు ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని చేత్తో పట్టుకొని కనిపించారు. ఈ నిరసనలకు అనుమతి ఇచ్చిన ఢిల్లీ పోలీసులు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వేదిక వద్ద భారీ భద్రత ఏర్పాటుచేశారు. అలాగే మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లోని అతడి నివాసం వద్ద భద్రతను మోహరించారు. కాగా.. ఈ నిరసనల్లో భాగంగా అభిజీత్‌ను కానీ, సీజేపీ సభ్యులను కానీ పోలీసులు అరెస్టు చేస్తే.. 42 రోజుల పాటు నిరాహార దీక్ష చేపడతానని సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాను కూడా భాగం అవుతానని ఇప్పటికే ఆయన ప్రకటించారు.

## ఇసుక దందా సాగితే సహించేది లేదు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో ఇసుక ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడంతో పాటు అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులను కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశించారు. శనివారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇసుక తవ్వకాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక లభ్యత, ఆదాయం, ఆదాయ వృద్ధికి ఉన్న అవకాశాలు, నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, వ్యవస్థలో తీసుకురావాల్సిన మెరుగుదలపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. అన్ని కార్యకలాపాల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలన్నారు. లారీల కదలికలను నిరంతరం పర్యవేక్షించే బలమైన నిఘా వ్యవస్థ ద్వారా అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీజీఎండీసీ డైరెక్టర్ అనుదీప్ దురిశెట్టి శాఖ చేపడుతున్న ఆదాయ వృద్ధి చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం, అక్రమ మైనింగ్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి మంత్రికి వివరించారు. కొన్ని ప్రాంతాల్లో శాఖ ఎదుర్కొంటున్న సవాళ్లను తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కీలక ఖనిజాలు, ఇతర ఖనిజాల అన్వేషణకు సంబంధించి కొనసాగుతున్న కార్యక్రమాలపై అధికారులు మంత్రికి నివేదిక సమర్పించారు. అన్వేషణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ప్రాధాన్యత గల అంశాలపై సమగ్ర నివేదికలను అందజేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సాండ్ బజార్ల పనితీరు, శాఖ నిఘా వ్యవస్థ, సిబ్బంది అవసరాలపై ఆరా తీశారు. రాష్ట్ర ఖనిజ వనరుల సమర్థ నిర్వహణ కోసం అమలు వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతో పాటు పరిపాలనా సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి వివేక్ సూచించారు.

## దేశమంతా ఆసక్తిగా చూస్తోంది

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. బెంగళూరులో ఓ సదస్సులో పాల్గొన్న సీఎం.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. ''ధనికులు విలాస భవనాలు, ఫామ్ హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. అంతేకాకుండా తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో 3 వేలమందితో హైడ్రా ఏర్పాటు చేశాం. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా.. ఆ కట్టడాలను నేలమట్టం చేస్తున్నాం. డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనది. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోంది.ఉపాధి విషయంలో.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి సారించాలి.

## 2028లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలోని పరిస్థితులు ఏమి తెలియని నాలుగు ఫీట్లు ఉన్న నాయకులు తెలంగాణ అభివృద్ధి, నీళ్లు, నిధులు గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, కాలం మనది కానప్పుడు వానపాములు కూడా నాగుపాములై బుసకొడతాయని బీఆర్ఎస్‌వర్కింగ్‌ప్రెసిడెంట్ కె. తారక రామారావు పేర్కొన్నారు. అలాంటి విషనాగులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. 2028లో మళ్ళీ తెలంగాణ రాష్ట్రంలో గులాబీ జెండా ఎగురుతుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శనివారం మలేషియా తెలుగు అసోసియేషన్, బీఆర్ఎస్ ఎన్నారై మలేషియా శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచంలో ఏ దేశానికి వెళ్ళినా తమ మాతృభూమిని మర్చిపోకుండా ఆవిర్భావ సంబరాలు చేసుకుంటున్న ఎన్నారైలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉన్న ఊరును, కన్న తల్లిని మర్చిపోకుండా ఖండాలు దాటినా తెలంగాణ తల్లిని తలుచుకుంటూ ఆవిర్భావ దినోత్సవాలను ఇంత ఘనంగా జరుపుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. వేల సంవత్సరాల కిందట మొదలైన తెలంగాణ చరిత్ర రాజులు, చక్రవర్తులు, కవులు, కళాకారులు, సంస్కృతి, పాటలతో తరతరాలుగా విలసిల్లుతున్నదన్నారు. తెలంగాణ జాతిలో ప్రతి తరం ఏదో ఒక యుద్ధాన్ని, రణాన్ని నడిపించిందని గుర్తుచేశారు. ప్రకృతితో మమేకమై బతుకమ్మను జరుపుకునే, పువ్వులను పూజించి ప్రకృతిని ఆరాధించే ఒకే ఒక్క జాతి ఈ ప్రపంచంలో తెలంగాణ జాతి అని స్పష్టం చేశారు. ఇంత అద్భుతమైన చరిత్ర, సంస్కృతి కలిగిన మనందరం నాది తెలంగాణ, నాది తెలంగాణ జాతి, నేను తెలంగాణ బిడ్డను అని సగర్వంగా చెప్పుకోవాలని పిలుపునిచ్చారు. మలి విడత ఉద్యమానికి నాయకత్వం వహించి, సబ్బండ వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్ళిన కేసీఆర్ నాయకత్వంలో పుష్కరానికి పైగా సాగిన ప్రజాస్వామిక ఉద్యమం వల్లనే ప్రత్యేక తెలంగాణ సిద్ధించిందన్నారు. భారత దేశంలో చిన్న రాష్ట్రమైన తెలంగాణ సైతం అత్యంత తక్కువ కాలంలోనే అద్భుతమైన విజయాలను సాధించిందన్నారు. ఒకనాటి వలసల తెలంగాణను, కరువుల తెలంగాణను దేశానికి అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్ దేనని స్పష్టం చేశారు. మలేషియా మాదిరే తెలంగాణలోనూ పామాయిల్ విప్లవం సాధించి, రైతన్నల వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న ఏకైక ఉద్దేశంతో పామాయిల్ కోసం మలేషియా నుంచి విత్తనాలు, మొక్కలు తీసుకువచ్చి తెలంగాణలో నాటించిన అంశాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఫలితంగా దేశంలోనే అత్యధికంగా పామాయిల్ ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ నిలిచిందన్నారు.

**ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు సరఫరా బీఆర్ఎస్‌ప్రధాన విజన్..**

60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలతో తల్లడిల్లిన తెలంగాణకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అన్ని రంగాలకు అందించిన తీరుగానే రాబోయే రోజుల్లో అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా 24 గంటల పాటు స్వచ్ఛమైన మంచినీటిని నిరంతరం సరఫరా చేయాలన్నదే తమ ప్రధాన విజన్ అని ప్రకటించారు. దీనితో పాటు ప్రజారవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ఆ దిశగా పూర్తి స్థాయిలో ప్రయత్నం చేస్తామన్నారు. తెలంగాణను తిరిగి అభివృద్ధి పథంలో నిలిపే శక్తి కేసీఆర్ గారికే ఉన్నదని, కేసీఆర్ ప్రభుత్వం తిరిగి రాగానే భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా తెలంగాణను తీర్చిదిద్దుతామన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాల్లో విపరీతమైన మార్పులు వస్తున్న నేపథ్యంలో, ప్రవాస భారతీయులు స్థానికులతో కలిసిమెలిసి ముందుకు సాగాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. స్థానికులతో, స్థానిక సంస్కృతితో కలిసి ముందుకు పోతే ప్రతి దేశంలోనూ తెలంగాణ బిడ్డలు అద్భుతమైన విజయాలు సాధిస్తారన్న విశ్వాసాన్ని కేటీఆర్ వ్యక్తంచేశారు.

## ఫ్రెంచ్ ఓపెన్ విజేత మిరా ఆండ్రీవా

**స్పోర్ట్స్ :** టెన్నిస్ ప్రపంచంలో సరికొత్త రికార్డు నమోదైంది. రష్యన్ టెన్నిస్ సంచలనం మిర్రా ఆండ్రీవా 19 ఏళ్ల వయసులోనే ప్రతిష్టాత్మకమైన 2026 ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. క్లే కోర్ట్ పై జరిగిన ఈ గ్రాండ్ స్లామ్ ఫైనల్ పోరులో 8వ సీడ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆండ్రీవా.. పోలాండ్ క్వాలిఫయర్ మాజా చ్వాలిన్స్కా తో మ్యాచ్ ఆరంభం నుండి దూకుడు ప్రదర్శించి 63, 62 తో వరుస సెట్లలో ఘన విజయం సాధించి, తన కెరీర్‌లో మొట్టమొదటి గ్రాండ్ స్లామ్ ట్రోఫీని ముద్దాడింది.

**టోర్నీ మొత్తం ఆండ్రీవా హవా..**

ఈ అద్భుత విజయంతో మిర్రా ఆండ్రీవా టెన్నిస్ హిస్టరీలో అరుదైన రికార్డులు కొల్లగొట్టింది. 1992లో టెన్నిస్ దిగ్గజం మోనికా సెలెస్ తర్వాత.. రోలాండ్ గారోస్ క్లే కోర్టుపై ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న అత్యంత చిన్న వయసున్న ఛాంపియన్‌గా ఆండ్రీవా సరికొత్త రికార్డు నెలకొల్పింది. రెండు వారాల పాటు సాగిన ఈ సుదీర్ఘ టోర్నమెంట్‌లో ఆండ్రీవా ప్రత్యర్థులకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా, మొత్తం టోర్నీలోనే కేవలం ఒకే ఒక్క సెట్ కోల్పోయిందంటే ఆమె చూపించిన తిరుగులేని ఆధిపత్యం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

**న్యూ సూపర్ స్టార్,,**

ఫైనల్ మ్యాచ్‌లో క్వాలిఫయర్ మాజా చ్వాలిన్స్కా గట్టి పోటీ ఇవ్వడానికి ప్రయత్నించినప్పటికీ, బేస్‌లైన్ నుండి ఆండ్రీవా సంధించిన పవర్‌ఫుల్ షాట్లు, ఆమె కోర్టు కవరేజ్ ముందు చ్వాలిన్స్కా ఆటలు సాగలేదు. కేవలం 19 ఏళ్ల ప్రాయంలోనే ఒత్తిడిని అధిగమించి, ప్రశాంతంగా ఆడుతూ గ్రాండ్ స్లామ్ గెలిచిన ఆండ్రీవా.. మహిళల టెన్నిస్ భవిష్యత్తుకు తానే సూపర్ స్టార్ అని నిరూపించుకుంది. ఈ సంచలన విజయంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెన్నిస్ అభిమానులు, మాజీ క్రీడాకారులు ఆండ్రీవాపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.



## ఫామ్‌హౌస్ కేడీతోనైనా.. ఢిల్లీ మోడీతోనైనా కొట్లాడతా

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కోహెడ పండ్లమార్కెట్ తెలంగాణకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకువస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా ఓఆర్ఆర్‌కు ఆనుకుని ఉన్న 239 విశాలమైన ఎకరాల్లో కోహెడ అంతర్జాతీయ పండ్లమార్కెట్ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు చూడలేని బీఆర్ఎస్.. వాటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. వరంగల్, ఆదిలాబాద్ లలో ఎయిర్ పోర్టు అక్కర్లేదని, ఫ్యూచర్ సిటీని అడ్డుకోవాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు కేవలం వరి, మొక్కజొన్నలు, పత్తి, మిర్చి పంటలు మాత్రమే పండిస్తున్నారని, కోహెడ మార్కెట్ అందుబాటులోకి వస్తే పండ్లను కూడా సాగుచేయవచ్చన్నారు. ఒకప్పుడు నగరానికి సరిపడా కూరగాయలు, పాలు రంగారెడ్డి జిల్లా నుంచే వచ్చేవని గుర్తుచేశారు. ఓఆర్ఆర్, ఎయిర్ పోర్టు వచ్చాక రంగారెడ్డి జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం పెరిగిందని, ఆ తర్వాతే జిల్లాలో వ్యవసాయం కుంటుపడిందన్నారు. కొత్తపేట నుంచి కోహెడకు పండ్లమార్కెట్ ను తరలించినపుడు తాత్కాలిక టెంట్లు వేయడంతో.. గాలి, వానకు అవి కూలిపోయి రైతులకు గాయాలయ్యాయని గుర్తుచేశారు. ఆనాడు తాను ఎంపీగా ఉన్నానని, అప్పుడే ఇంటిగ్రేటెడ్ పండ్లమార్కెట్ నిర్మిస్తానని హామీ ఇచ్చానని, నేడు ఆ హామీని సీఎంగా నెరవేస్తున్నానని తెలిపారు. రూ.లక్ష కోట్ల వ్యయంతో కట్టిన కాళేశ్వరం.. నేడు కూలేశ్వరం అయినా దేశంలోనే అత్యధికంగా వరిని ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు.వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు.

కాళేశ్వరం లేకపోతే వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని నిరూపిస్తున్నామన్నారు. కూలేశ్వరం నేతలతో సలహాలు చెప్పించుకోవాల్సిన అవసరం తమకు లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కారు ఇప్పుడు పూర్తిగా చెడిపోయి షెడ్డుకు చేరిందని, ఇప్పుడు ఎన్ని రిపేర్లు చేసినా చెడిపోయిన కారు ఇక పనికిరాదని తెలిపారు.


కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నామన్నారు.

నాడు విధ్వంసం సృష్టిస్తే.. తాము వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నామన్నారు.బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. ఫామ్‌హౌస్‌లో ఉన్న కేడీతోనైనా.. ఢిల్లీలో ఉన్న మోడీతోనైనా కొట్లాడతా. నేను పదవి నుంచి దిగిపోవాలని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోడీ గద్దె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా'' అని సీఎం అన్నారు.ఎవరెంత ఏడ్చినా, ఎన్ని కుట్రలు పన్నినా ఆర్ఆర్ఆర్, అభివృద్ధి ఆగదని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కట్టితీరుతామని, 2034 వరకూ తమదే అధికారమని పునరుద్ఘాటించారు. మోడీని చూపించి భయపెట్టాలనుకుంటే భయపడమని, తమకు మాటలతో పాటు చేతలు కూడా తెలుసని హెచ్చరించారు.

స్నేహిత
ఎక్స్‌ప్రెస్
07-06-2026
ఆదివారం
హైదరాబాద్
expresstelugudaily.com


# పిఎస్ఆర్ నగర్ నిర్మాణంలో పోచారం సురేందర్ రెడ్డి కృషి మరువలేనిది





- పంటసాగులో అత్యధిక దిగుబడులు గడిస్తున్న నియోజక వర్గం బాన్సువాడ
- పోచారం శ్రీనివాస్ రెడ్డి
- అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిన ఏకైక నియోజక వర్గం బాన్సువాడ
- కాసుల బాల్ రాజ్
- పీఎస్ఆర్ నగర్,తిరుమలపూర్లలో నూతన జీపీ భవనాలకు భూమి పూజ

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పీఎస్ఆర్ నగర్ గ్రామ నిర్మాణంలో పోచారం సురేందర్ రెడ్డి భాగస్వామ్య కృషి మరువలే నిదని.పంట సాగులో అత్యధిక దిగుబడులు గడిస్తున్న రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజక వర్గం బాన్సువాడ అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలలో పరిపూర్ణ అభివృద్ధి సాధించిన ఏకైక నియోజక వర్గం బాన్సువాడ అని రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రియల్ చైర్మన్ కాసుల బాల్ రాజ్ అన్నారు.శనివారం పోతంగల్ మండలంలోని తిరుమలపూర్, పీఎస్ఆర్ నగర్ గ్రామాలలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి,కాసుల బాల్ రాజ్ భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా వారీరువురు మాట్లాడుతూ..మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని అన్నారు. భారత దేశంలో రూ.5 లక్షల వ్యయంతో పేదలకు ఇండ్లు మంజూరు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని.ప్రతి ఒక్కరికి తోడుతో (ఇల్లాలు) పాటుగా గూడు అవసరమనీ. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర కొనసాగే ప్రక్రియ అని. గ్రామాలలో ఇండ్లు లేని నీరు పేదలు ఉండవద్దనీ.అందుకు అనుగుణంగా ప్రజా ప్రతినిధులు, నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.పీఎస్ఆర్ నగర్ గ్రామ నిర్మాణంలో అన్ని తానై ప్రతి పనిని ముందుండి నడిపించి అనేక కష్టనష్టాలను అనుభవించి గ్రామాభివృద్ధిలో భాగస్వామైన పోచారం సురేందర్ రెడ్డి సేవలు అభినందనీయమని కొనియాడారు. రూ.200 కోట్ల వ్యయంతో పోతంగల్ మండ లంలోని పిఎస్ఆర్ నగర్లో 25 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు జరుగుతున్నాయని.ఈ పాఠశాల పూర్తి అయితే ఇక్కడి ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని అన్నారు. బంధువులు,చుట్టాలు అని ఇతర ప్రాంతాల వారిని పీఎస్ఆర్ నగర్లో షెల్టర్ ఇస్తే భవిష్యత్తులో ఈ గ్రామ ప్రజలే ఇబ్బందులకు గురవుతారని అటువంటి చర్యలను గ్రామస్తులందరు వెంటనే నిలువరించుకోవాలన్నారు. రూ.34 కోట్లు వ్యయంతో పోతంగల్ చెక్పోస్ట్ నుండి హంస వరకు డబుల్ రోడ్డు మంజూరు అయిందనీ.దీంతో ఇక్కడ ప్రజల రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు.ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని శాస్ర వేత్తలు,వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధికై పలు అభివృద్ధి పనులు కావాలని గ్రామ సర్పంచ్లు పోచారం శ్రీనివాస్ రెడ్డికి కోరగా అందుకు పోచారం సానుకూలంగా స్పందించి పనులన్నింటికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తిరుమలా పూర్ గ్రామ సర్పంచ్ బోయి సైదవ్వ,ఉప సర్పంచ్ బెలిగే సంజీవ్ కుమార్,పిఎస్ఆర్ నగర్ గ్రామ సర్పంచ్ గాండ్ల రాంభాయి, ఉప సర్పంచ్ హాట్కర్ సతీష్, పోతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల శంకర్,రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ గైక్వాడ్ హనుమంతు,పోతంగ ల్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సిండే షాజీ పాటిల్,ఎమ్మార్వో సందీప్,ఎంపీడీవో చందర్ నాయక్,పిఆర్ఏఈ సాయిలు, మాజీ జెడ్పిటిసి శంకర్ పటేల్, మాజీ ఎంపీపీ గంధపు పవన్, మాజీ సర్పంచ్ వర్ని శంకర్,ఏఓ నిశిత,ఆర్ డబ్ల్యు ఏఈ ధన్ రాజ్, సీనియర్ నాయకులు రమేష్ సేట్,ఎజాజ్ ఖాన్,నీరడి గంగాధర్, దిలీప్ కుమార్,చాకూరి గంగాధర్, హనుమంతు రావు,ఆయా గ్రామాల సర్పంచులు,నాయకులు, తిరుమలపూర్,పిఎస్ఆర్ నగర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం!

- హుగ్గెల్లి గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి
- హుగ్గెల్లిలో ఘనంగా ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక గ్రామ సభ



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ గ్రామ సభ ఘనంగా జరిగింది. సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్ రెడ్డి,డిఎస్పీ సైదా నాయక్,ఎస్ఐ కాశీనాథ్,లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వక్తలు పేర్కొన్నారు.గ్రామ సభలే ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఉత్తమ వేదికలని విద్య, వైద్యం పారిశుద్ధ్యం వంటి రంగాల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమని వారు స్పష్టం చేశారు. ముఖ్యంగా రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, అంటువ్యాధుల నివారణకు ప్రతి కుటుంబం తడిపొడి చెత్తను వేరుగా సేకరించాలని,గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.రైతులకు పంట మార్పిడి విధానాలు, వ్యవసాయ శాఖ సూచించే శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు.బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు.అలాగే, ఓటరు జాబితా సవరణలో అర్హులైన ప్రతి ఒక్కరూ పేరు నమోదు చేసుకోవాలని, మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన షీ టీమ్స్ సేవలను ఆపద సమయంలో వినియోగించుకోవాలని డిఎస్పీ సైదా సూచించారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగస్వాములు కావాలి

- కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్
- కోహిర్ మున్సిపల్లో 99,రోజుల ప్రణాళిక సమావేశం
- కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు,అధికారులు



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ పిలుపునిచ్చారు.కోహిర్ పట్టణంలో వివిధ వార్డుల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ 99 రోజుల కార్యక్రమం జూన్ 12 వరకు కొనసాగుతుందని, కౌన్సిలర్లు అందరు స్థానికంగా అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పెండింగ్ ఫైల్స్ పరిష్కారం, పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మన పనితీరు ఉండాలని తెలిపారు. ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకుంటూ క్షేత్రస్థాయి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని మున్సిపల్ చైర్మన్ సూచించారు. ప్రతి సమస్యపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గత పాలకులు వైఫల్యం కారణంగా ప్రజలు మనకు అవకాశం ఇచ్చారని, రెండున్నర సంవత్సరాలలో రైతు రుణమాఫీ, రైతుభరోసా,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం సరఫరా వంటి అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది అన్నారు. మున్సిపాలిటీలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ రంగానికి ప్రత్యేకంగా న్యాయం చేసేందుకు ప్రభుత్వం పనిచేస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శశిధర్,కోహిర్ మున్సిపల్ వైస్,చైర్మన్ ఎండీ. హన్నాన్ జావీద్, కౌన్సిలర్లు సంపత్ కుమార్,శ్రీకాంత్,తో పాటు వివిధ వార్డుల కౌన్సిలర్లు, అధికారులు,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు

- స్పెషల్ ఆఫీసర్ గా ఉమేష్, ఎమ్మార్వో వెంకటేశ్వర్లు
- రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలి
- సర్పంచ్ చెన్నయ్య ఆధ్వర్యంలో గ్రామసభ



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల పరిధిలో విఠలాపూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ పండుగ చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మండల స్పెషల్ ఆఫీసర్ ఉమేష్,ఎమ్మార్వో వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరి పాల్గొని గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,వార్డ్ మెంబర్లు తదితరులు మహిళలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కరణం ప్రహ్లాద్‌రావుకు జన్మదిన వేడుకలు

- చౌడాపూర్ మండల బిజెపి పార్టీ అధ్యక్షులు బి.శ్రీనివాసులు

**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బీజేపీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్‌రావు జన్మదిన వేడుకలు కుల్కచర్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చౌడపూర్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు బి.శ్రీనివాసులు బిజెపి పార్టీ కార్యకర్తలు పాల్గొని కరణం ప్రహ్లాద్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రహ్లాద్‌రావు పార్టీ అభివృద్ధికి చేస్తున్న సేవలను కొనియాడిన చౌడాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు ఆయన మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో చౌడాపూర్ మాజీ బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు బందయ్య,సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రహ్లాద్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# మత్స్య శాఖ ఏడి మా గ్రామానికి న్యాయం చేయడం లేదు





- చేపలు పట్టడానికి కోర్టు ఆదేశాలు ఉన్న,అనుమతులు ఇవ్వడం లేదు

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్ మత్స్య కార్మిక సంఘం వారికి చేపలు పట్టడానికి అర్హత ఉన్న జిల్లా మత్స్యశాఖ ఏడి ఫిషరీస్ న్యాయం చేయడం లేదని మత్స్య కార్మికులు ఆరోపించారు.శుక్రవారం చేపలు పట్టడానికి చెరువుకు వెళ్లగా అనుమతులు ఇచ్చిన ఏడి ఫిషరీస్ , మళ్లీ పెద్ద చెరువులో చేపలు పట్టవద్దని చెప్పడంతో గడి పెద్దాపూర్ మత్స్య కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. చేపలు పట్టి జీవనోపాధి పొందుతున్న తమకు సొసైటీ ఉన్నప్పటికీ మత్స్యశాఖ జిల్లా అధికారులు తమకు సరైన న్యాయం చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గడి పెద్దాపూర్ గ్రామంలోని పెద్ద చెరువులో చేపలు పట్టాలని మత్స్యశాఖ ఏడి ఆదేశాలిచ్చి, మరలా వద్దని చెప్పడం ఏమిటని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.చెరువులో చేపలు నెల రోజుల క్రితమే పట్టాల్సి ఉండగా మత్స్యశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో హైకోర్టు ఆశ్రయించి అనుమతులు పొందిన, మత్స్య శాఖ ఏడి తమ పక్క గ్రామమైన కంసాన్పల్లి గ్రామస్తులకు వత్తాసు పలుకుతున్నారని, అన్ని అనుమతులు ఉన్న తమకు చేపలు పట్టవద్దని చెప్పడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. ఇప్పటికే పెద్ద చెరువులో చేపలు చనిపోవడం వల్ల మత్స్య కార్మికులమైన తమకు తీవ్ర నష్టం జరిగిందని ఇట్టి నష్టం ఎవరు భరిస్తారని వారు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి చేపలు పట్టడానికి అనుమతులు ఇచ్చేలా మత్స్యశాఖ ఏడికి ఆదేశాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. రెండు గ్రామాల వేరువేరు జిల్లాలో ఉండడంతో అర్హులైన వారికి న్యాయం జరగడంలేదని వాపోయారు. రెండు గ్రామాల కార్మికులు చెరువు వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అల్లాదుర్గం సీఐ రేణుక,ఎస్ఐ శంకర్ పర్యవేక్షించారు.

# కష్టకాలంలో ధైర్యం నింపిన మాజీ ఎమ్మెల్యే కందాళ






- ప్రజల కష్టసుఖాల్లో నేనున్నా.. పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ
- కూసుమంచి మండలంలో బాధిత కుటుంబాలు,అనారోగ్య బాధితులకు పరామర్శ
- ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా

**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రజల కష్ట సుఖాల్లో భాగస్వామ్యం కావడమే ప్రజాప్రతినిధుల అసలైన బాధ్యత అని మరోసారి చాటిచెప్పుతూ పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని మానసిక ధైర్యాన్ని నింపారు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన లోడిగా రాములమ్మ, గాంతి లచ్చిరెడ్డి కుటుంబాలను, అలాగే చౌటుపల్లి-చేగొమ్మ గ్రామాలకు చెందిన సట్టు కోటమ్మ, మరికంటి వెంకటనారాయణ కుటుంబాలను వారి నివాసాల్లో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని, కష్టకాలాన్ని అధిగమించేలా మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు.అనారోగ్య బాధితులకు పరామర్శ.. వైద్య సహకారానికి హామీ

అనంతరం కూసుమంచి గ్రామానికి చెందిన కొక్కిరేణి వీరస్వామి మరియు మందనాగుల అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని వారి నివాసాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పొందుతున్న వైద్యం, ఆరోగ్య స్థితిగతులపై కుటుంబ సభ్యులతో చర్చించారు. అవసరమైతే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కుసుమంచి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కనకం మైసయ్యతో కాసేపు ముచ్చటించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడు మాత్రమే కాకుండా కష్టాల్లో ఉన్నప్పుడు కూడా వారితో ఉండటం తన బాధ్యతగా భావిస్తానన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజల ప్రేమాభిమానాలే తనకు బలమని, వారి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పర్యటనతో బాధిత కుటుంబాలకు ధైర్యం, భరోసా లభించిందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# ధర్మ రక్షణ కోసమే రథయాత్ర..!

## అవధూత గిరి మహారాజ్

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సనాతన ధర్మ రక్షణ, దేవాలయాల పరిరక్షణ కోసం తెలుగు రాష్ట్రాల్లో "ఆదిశంకరాచార్య వైభవం" పేరుతో రథయాత్ర నిర్వహిస్తున్నట్లు బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ పేర్కొన్నారు. శనివారం ఆశ్రమ ఆవరణంలో రథయాత్రకు సంబంధించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు. గత ఏప్రిల్ 21న హైదరాబాద్‌లోని తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయంలో మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఈ యాత్ర ప్రారంభమైందని,త్వరలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రవేశించనున్నట్లు తెలిపారు.ప్రతి గ్రామంలో ధర్మం, దేవాలయాలు, భారతీయ సంస్కృతిసంప్రదాయాల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడమే రథయాత్ర ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అలాగే, ఆది శంకరాచార్యుల విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. హిందూ ధర్మం సత్యం, అహింస,దయ, సేవ, పరస్పర గౌరవం వంటి విలువలను బోధిస్తుందని, సమాజంలో నైతిక విలువలు పెంపొందించడంలో ధర్మం కీలక పాత్ర పోషిస్తుందని అవధూత గిరి మహారాజ్ అన్నారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వేద భారతి వ్యవస్థాపకులు డాక్టర్ రేమెళ్ల అవధానులు, ఆధ్యాత్మికవేత్త ప్రసాద్, ఆనందగిరి మాత, నందినిగిరి మాత, వైదిక పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.





# ధర్మ పరిరక్షణ కోసమే శివశక్తి..!

## జిల్లా కన్వీనర్ శ్యామ్‌రావు పాటిల్

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సనాతన ధర్మ పరిరక్షణ, ఆలయాల అభివృద్ధి, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడడమే శివశక్తి లక్ష్యమని జిల్లా శివశక్తి కన్వీనర్ శ్యామ్‌రావు పాటిల్ పేర్కొన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించిన లింగాష్టకం పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం, భజనసంకీర్తన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు .ఈ సందర్భంగా బర్దిపూర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో కోట నారాయణ,బి.కృష్ణ,లక్ష్మారెడ్డి, గొల్ల మానెన్న,ఆకుల రవి, మల్లయ్య స్వామి, నారాయణ,వడ్ల సిద్ధన్న,దత్తు స్వామి, బాబన్న తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com